క్లుప్తంగా

మంచినీటి పథకం ప్రారంభం



మంచినీటి పథకాన్ని ప్రారంభిస్తున్న సూర శ్రీనివాసరావు

ఎచ్చెర్ల క్యాంపస్: తోటపాలెంలో సొంత నిధులతో నిర్మాణం చేపట్టిన మంచినీటి పథకాన్ని వ్యాపారవేత్త సూర శ్రీనివాసరావు బుధవారం ప్రారంభించారు. ఎస్ఎస్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ స్థానికుల తాగునీటి అవసరాలు తెలుసుకుని మంచినీటి పథకం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. శ్రీనివాసరావును గ్రామస్తులు, ఉపాధ్యాయులు సత్కరించారు. ఎంఈఓ–2 జి.రాజకిశోర్, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ కళ్లేపల్లి తిరుపతిరావు, హెచ్ఎం బలివాడ మురళీమోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాగపాలెంలో 104 సేవలు

లావేరు: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని గుమడాం పంచాయతీ ఎంపీటీసీ జగ్గురోతు మహాలక్ష్మి అన్నారు. మండలంలోని నాగపాలెం గ్రామంలో బుధవారం 104 వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 104 వైద్యులు, సిబ్బంది వైద్య తనిఖీలు నిర్వహించి మందులు అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు జగ్గురోతు తవిటి నాయుడు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

ఔదార్యం



యర్రయ్య కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న అల్లు అర్జున్ అభిమానులు

రణస్థలం: మండలంలోని జీరుపాలెం గ్రామానికి చెందిన వాసుపల్లి యర్రయ్య దంపతుల రెండున్నర నెలల పాప గుండె సంబంధిత సమస్యతో బాధపడుతోంది. ఆపరేషన్‌కు లక్షల్లో ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పడంతో తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. ఈ విషయం తెలుసుకున్న అల్లు అర్జున్ అభిమానులు, ఏఐఏఎఫ్‌డబ్ల్యూఏ రణస్థలం టీమ్ సభ్యుడు ఉప్పాడ కామరాజు తదితరులు యర్రయ్య కుటుంబ సభ్యులకు రూ.12,500 ఆర్థికసాయం బుధవారం అందజేశారు. గోపి, కుమార్, రమేష్ రెడ్డి, తేజ, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు మంజూరు



రేషన్‌కార్డు అందజేస్తున్న సర్పంచ్ భాస్కరరావు

లావేరు: అర్హులందరికీ ఈ ప్రభుత్వం రేషన్‌కార్డులు మంజూరు చేస్తుందని కొత్తకోట సర్పంచ్ శాంతాటి భాస్కరరావు అన్నారు. మండలంలోని చినకొత్తకోట గ్రామంలో పలువురుకు కొత్తగా మంజూరైన రేషన్ కార్డులను బుధవారం పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థల ద్వారా ఇంటి వద్దకే వెళ్లి పథకాలు అందజేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం



తాగునీటి బోరును బాగు చేయిస్తున్న సర్పంచ్ బవిరి రమణ

రణస్థలం: జే.ఆర్.పురం పంచాయతీ 10వ వార్డు సంతోషిమాత కాలనీలో సురక్షిత తాగునీటి బోరును జే.ఆర్.పురం సర్పంచ్ బవిరి రమణ బుధవారం బాగు చేయించారు. గతకొన్ని రోజులుగా తాగునీటికి ఇబ్బంది పడుతున్న ఆ వార్డు వాసులకు బోరు బాగుచేయడంతో సమస్య పరిష్కారం అయింది. పంచాయతీ కార్యదర్శి ఎల్.ఆదినారయణ, మెకానిక్ రమణ, వార్డు మెంబర్ సుంకరి రమణ, కాలనీ వాసులు ఉన్నారు.

'తెలుగు భాష మాధుర్యాన్ని తెలుసుకోవాలి

శ్రీకాకుళం అర్బన్: రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గిడుగు రామ్మూర్తి జయంతి వారోత్సవాలను స్థానిక ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్లో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ దేవదత్తానంద్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ.. తెలుగు భాష మాధుర్యాన్ని ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు. వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి చేసిన సేవలను వివరించారు. తెలుగు సహాయకులు చాడ శ్రీనివాస్, సీనియర్ ఉపాధ్యాయులు వాదాడ శ్రీనివాస్ పాల్గొన్నారు.

టంగుటూరి ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి



లావేరు: లావేరులో ప్రకాశం పంతుల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు

లావేరు: టంగుటూరి ప్రకాశం పంతులు ఆశయాలను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని లావేరు శాఖాగ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని లావేరు గ్రామంలో గల శాఖా గ్రంథాలయంలో బుధవారం స్వాతంత్ర్య సమరయోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని నిర్వహించారు. ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేశారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. నిరుపేద కుటుంబంలో పుట్టి ఆంధ్ర రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయిన వ్యక్తి టంగుటూరి ప్రకాశం పంతులు అని అన్నారు. ప్రత్యేకాంధ్ర రాష్ట్ర సాధనలో ప్రకాశం పంతులు నిర్ణాయక పాత్ర పోషించారన్నారు. మద్రాసులో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో తుపాకికి ఎదురుగా గుండె నుంచి ఆంధ్రకేసరి అనే బిరుదును పొందారన్నారు. ఉపాధ్యాయుడు కె.కృష్ణ, గ్రంథాలయ సహాయకుడు ఎ.గడ్డెయ్య, పాఠకులు పాల్గొన్నారు.

టంగుటూరికి ఘనంగా నివాళులు

జి.సిగడాం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని బుధవారం నిర్వహించారు. ప్రకాశం పంతులు చిత్రపటానికి ఎంపీపీ మీసాల సత్యవతి నివాళులర్పించారు. మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యులు కాయల రమణ, ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు, ఏపీఓ చోళ్ల సత్యనారాయణ, ఏపీఎం రెడ్డి రామకృష్ణంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: స్వాతంత్ర్య పోరాటంలో సైమన్ కమిషన్‌కు తన గుండెను చూపించి ఎదురొడ్డిన ధీశాలి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు అని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సురేఖ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధుల స్మృతివనంలో టంగుటూరి 151వ జయంతి వేడుకలు బుధవారం కమిటీ ప్రతినిధులు నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సాధారణ కుటుంబంలో జన్మించిన టంగుటూరి ఉన్నత చదువులు అభ్యసించి స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిదాతగా పేరుగాంచారన్నారు. ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా, నీతి, నిజాయితీలకు నిలువుటద్దంగా పనిచేశారన్నారు. గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు డాక్టర్ జామి భీమశంకర్, వావిలపల్లి జగన్నాథం నాయుడు, అవధాన పండితులు పైడి హరనాథరావు, డాక్టర్ నిక్కు అప్పన్న, నక్క శంకరరావు, పందిరి అప్పారావు, మెట్ట అనంతంభట్లు, తర్లాడ అప్పలనాయుడు, మెట్ట సులోచన, పి.కామేష్, ఎం.వి.ఎస్.ఎస్.శాస్త్రి పాల్గొన్నారు.

ధీరోదాత్తుడు టంగుటూరి

ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని ఆంధ్రరాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి అయిన ధీరోధాత్తుడు టంగుటూరి ప్రకాశంపంతులు అని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని పీపీఎన్ కాలనీలో గల న్యూ సెంట్రల్ స్కూల్‌లో ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పాఠశాల డైరెక్టర్ శ్రీకాంత్, కో–ఆర్డినేటర్లు ఎం.వి.ఎస్.ఎస్.మూర్తి, సరోజినీ, వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటరావు, బాల సరస్వతి పాల్గొన్నారు.

శ్రీకాకుళం పాతబస్టాండ్: శ్రీకాకుళంలోని స్వాతంత్ర్య సమర యోధుల పార్కులో ప్రకాశం పంతులు విగ్రహానికి బార్ అసోసియేషన్ ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు, ఆంధ్రప్రదేశ్ బీసీ న్యాయవాదుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆగూరు ఉమామహేశ్వరరావు, చౌదరి లక్ష్మణరావు, బి.వి.రమణ పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో..

శ్రీకాకుళం రూరల్: స్థానిక ఎంపీడీవో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా పంచాయతీరాజ్ విభాగపు అధ్యక్షుడు అంబటి శ్రీనువాసరావు తదితరులు టంగుటూరు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

శ్రీకాకుళం కల్చరల్: టంగుటూరి ప్రకాశంపంతులు సేవలు చిరస్మరణీయమని ఉపనిషన్మందిర వక్తలు పేర్కొన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమాన్ని పాత శ్రీకాకుళంలోని టంగుటూరి ప్రకాశం పంతులు ఉన్నత పాఠశాలలో ఉపనిషన్మందిరం ఆధ్వర్యంలో నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.వి.రమణమూర్తి, ఉపనిషన్మందిర అధ్యక్షుడు గుమ్మా నగేష్, సభ్యులు డాక్టర్ మందుల మోహనరావు, నిష్ఠల నరసింహమూర్తి, రంగుడు ప్రసాదరావు పాల్గొన్నారు. అనంతరం 200 మంది విద్యార్థులకు పెన్నులు, బిస్కెట్లు పంపిణీ చేశారు.



జి.సిగడాం: ఎంపీడీఓ కార్యాలయంలో టంగుటూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



శ్రీకాకుళం అర్బన్: టంగుటూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న కమిటీ ప్రతినిధులు



శ్రీకాకుళం అర్బన్: టంగుటూరిచిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎన్‌సీఎస్ ప్రతినిధులు



శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రకాశం పంతులు విగ్రహానికి నివాళులర్పిస్తున్న న్యాయవాదులు



శ్రీకాకుళం రూరల్: టంగుటూరు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



శ్రీకాకుళం కల్చరల్: విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఉపనిషన్మందిర వక్తలు

చంద్రయాన్–3 విజయోత్సాహం



శ్రీకాకుళం అర్బన్: ఆనందంలో విద్యార్థులు

జి.సిగడాం: అంతరిక్ష చరిత్రలో సరికొత్త రికార్డును సృష్టించిన భారత్ శాస్త్రవేత్తలకు సలాం అంటూ బుధవారం స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయంలో చదువుతున్న బాలికలు అభినందనలు తెలిపారు. టీవీలో ప్రచారాన్ని వీక్షించారు. దేశం ఖ్యాతిని ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిపిన ఇస్రో శాస్త్రవేత్తలకు సలాం చేశారు. విద్యాలయం ప్రత్యేక అధికారి ఉషారత్నం కుమారితోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం నగరంలోని గ్లోబల్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో చంద్రయాన్–3 విజయవంతమైన సందర్భంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రతినిధులు మాట్లాడుతూ అగ్రదేశాలు సైతం సాధించలేని విజయం భారతదేశం సాధించిందన్నారు. ఇస్రో శాస్త్రవేత్తల కృషికి, శ్రమకు దేశం మొత్తం జోహార్లు చేస్తోందన్నారు. భారత్‌మాతాకీ జై అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు.



శ్రీకాకుళం రూరల్: వప్పంగిలో విద్యార్థుల ర్యాలీ

వప్పంగి స్కూల్లో..

శ్రీకాకుళం రూరల్: వప్పంగిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జయహో చంద్రయాన్–3 విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. చంద్రునిపై భారతీయ శాస్త్రవేత్తలు ప్రయోగించిన ఉపగ్రహం ఆర్బిటాల్‌ను విజయవంతం కావడంతో ఈ ర్యాలీ చేపట్టారు. ప్రధానోపాధ్యాయురాలు టి.ఉమాకుమారి మాట్లాడుతూ.. సైన్సు పట్ల విద్యార్థులు ఆసక్తి కనబర్చాలన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం

- వైఎస్సార్‌సీపీ నాయకుడు రామ్‌మనోహర్‌నాయుడు



బ్రోచర్లను అందజేస్తున్న రామ్‌మనోహర్‌నాయుడు

శ్రీకాకుళం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమం సాధ్యమని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు అన్నారు. బైరివానిపేట గ్రామంలో రెండో రోజైన బుధవారం కూడా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో చేకూరిన లబ్ధిని వివరించి.. అందుకు సంబంధించిన బ్రోచర్లను అందజేశారు. గ్రామంలోని కమ్యూనిటీ హాల్లో సచివాలయం ఉండడంతో ఫంక్షన్లు చేసుకోవాలంటే వేరే ప్రాంతానికి వెళ్లాల్సి వస్తోందని వివరించారు. దీనికి రామ్‌మనోహర్‌నాయుడు స్పందిస్తూ.. దీన్ని త్వరితగతిన మార్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే శ్మశానవాటిక రోడ్డుకు నిధులు మంజూరుకు కృషి చేస్తానని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సీపాన రామారావు, గడప ఖగేశ్వరరావు, రాకోటి జనార్దన్‌రావు, సీపాన రమణ, వలంటీర్లు పాల్గొన్నారు.

నిరంతర సాధనతోనే ఉత్తమ ఫలితాలు



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న భూపతిరావు

ఎచ్చెర్ల క్యాంపస్: నిరంతర సాధనతోనే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని వ్యక్తిత్వ వికాస నిపుణుడు బొడ్డేపల్లి భూపతిరావు అన్నారు. కొత్తపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రేరణ తరగతులు నిర్వహించారు. పాఠశాల విద్య నుంచి క్రమశిక్షణతో చదవాలన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో మంచి ప్రతిభ ఉందన్నారు. విద్యార్థులు ప్రతి పాఠ్యాంశాన్ని విశ్లేషణ, అవగాహన పద్ధతుల్లో చదవాలన్నారు. ప్రాధాన్యత గల అంశాలను నోట్స్ రాసుకోవాలని, సందేహాలు ఉంటే ఉపాధ్యాయులు దృష్టికి తీసుకువెళ్లి నివృత్తి చేసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు సైతం పిల్లల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మొదలవలస లక్ష్మణరావు, స్పందన ఫౌండేషన్ అధ్యక్షుడు శ్యామ్యూల్ రెడ్డి పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా తయారీకి సహకరించాలి

శ్రీకాకుళం రూరల్: కొత్త ఓటర్ల జాబితా తయారీకి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఆర్డీవో బొడ్డేపల్లి శాంతి కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీ నేతలతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 15 నుంచి 21వ తేదీ వరకూ సేకరించిన ఓటర్ లిస్టులో కొత్త ఓట్లు, తొలగించిన ఓట్లపై రాజకీయ పార్టీ నేతలకు వివరించారు. తహసీల్దార్ వెంకట్రావు, ఎలక్షన్ డీటీ హేమసుందర్, రాజకీయ పార్టీ ప్రతినిధులు రావాడ పురుషోత్తం, మాధవరావు, రావాడ సురేష్ తదితరులు ఉన్నారు.

అయ్యప్పస్వామికి పూజలు



పూజలందుకుంటున్న స్వామివారు



పాతశ్రీకాకుళంలోని ఆలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: బలగలోని అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం స్వామికి క్షీరాభిషేకాలు జరిగాయి. ఉదయం ఐదు గంటల నుంచే ప్రారంభమైన పంచామృతాభిషేకాల సేవలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అర్చకులు దేవరకొండ శంకరనారాయణ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు రెడ్డి చిరంజీవులు, రాజారావు, ఏర్పాట్లు చేశారు.

పాతశ్రీకాకుళంలోని ధర్మశాస్తా దేవాలయంలోని అయ్యప్పస్వామి ఆలయంలో కూడా స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, సహస్రనామార్చనలు జరిగాయి. ఈ సందర్భంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఎల్.నందికేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పారిశ్రామిక అవసరాలు తెలుసుకోవాలి



మాట్లాడుతున్న వ్యక్తిత్వ వికాస నిపుణుడు కిరణ్

ఎచ్చెర్ల క్యాంపస్: ఇంజినీరింగ్ విద్యార్థులు పారిశ్రామిక అవసరాలు తెలుసుకోవాలని వ్యక్తిత్వ వికాస నిపుణుడు, మన్యా టెక్నో సొల్యూషన్స్ సీఈఓ (హైదరాబాద్) కిరణ్ అన్నారు. ఎచ్చెర్లలోని శ్రీవేంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజీలో బుధవారం నాలుగు రోజులపాటు నిర్వహించనున్న 'కళాశాల నుంచి కార్పొరేట్ ఉద్యోగం వరకు' అన్న అంశంపై శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ రంగంలో పరిశ్రమలు విస్తరిస్తున్నాయన్నారు. పరిశ్రమల అవసరాలు దృష్టిలో పెట్టుకొని విద్యార్థులు నైపుణ్యాలు సాధించాలన్నారు. ఇంజినీరింగ్‌లో అమలు చేస్తున్న ఇంటర్న్‌షిప్‌లో మంచి కంపెనీలు ఎంచుకుంటే విషయ పరిజ్ఞానం, పని చేసే నైపుణ్యం సాధించవచ్చన్నారు. విద్యార్థులు ఇంజినీరింగ్‌లో మూడో ఏడాది నుంచి ఉద్యోగ, ఉపాధి నైపుణ్యాలపై దృష్టిపెట్టాలన్నారు. అధునాతన సాఫ్ట్‌వేర్లు తెలుసుకోవాలన్నారు. ఇంటర్వ్యూ స్కిల్స్ సైతం కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సి.వి.రమణమూర్తి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వెల్పురాయిలో వైఎస్సార్ పొలంబడి



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

రణస్థలం: వరి పంటలో రసాయన ఎరువులు, పురుగు మందులు తగ్గించి, ద్రవజీవామృతం 20 రోజులకు ఒకసారి వేస్తే మంచి ఫలితాలు ఉంటాయని రణస్థలం వ్యవసాయశాఖ అధికారి డి.వి జయభాస్కర్ అన్నారు. మండలంలోని వెల్పురాయి గ్రామంలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. సస్యరక్షణ పద్ధతి వల్ల పంటలకు చీడపీడలు తగ్గుతాయన్నారు. జీవామృతం తయారీకి 200 లీటర్ల ప్లాస్టిక్ డ్రమ్ము, పది కేజీల దేశీయ ఆవు పేడ, పది లీటర్ల మూత్రం, రెండు కేజీల శనగపిండి, రెండు కేజీల బెల్లం, పుట్టమట్టి పిడికెడు కలిపి వారం రోజుల తరువాత పొలంలో వేయాలన్నారు. ఇలా చేయడం వల్ల వరి పంట బాగా పెరుగుతుందని, మిత్ర కీటకాలు కూడా బాగా అభివృద్ధి అవుతాయన్నారు. మాజీ ఎంపీటీసీ కెల్ల రామకృష్ణ, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.











